www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 27 ఫిబ్రవరి 2025
5
అన్నమయ్య



ప్రభుత్వ ఖాజీగా షేక్ మొహమ్మద్ జలాలుద్దీన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె నియోజకవర్గ ప్రభుత్వ ఖాజీగా పట్టణానికి చెందిన షేక్ మొహమ్మద్ జలాలుద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జిఒ ఎంఎస్ నెంబర్ 25 ఈ నెల 24న విడుదల చేసింది. ఆయన ఈ హోదాలో ప్రాథమికంగా పదేళ్ల పాటు ఉంటారు. ఈ మేరకు షేక్ మొహమ్మద్ జలాలుద్దీన్ విజయవాడలో సింఎ చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఖాజీ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి.ఫరూఖ్, ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు కృతజ్ఞతలు తెలిపారు.



సిఎం చంద్రబాబుతో మొహమ్మద్ జలాలుద్దీన్

భూ కబ్జాదారుల బరితెగింపు

- రెవెన్యూ సిబ్బందిపై భూ కబ్జాదారుడి దాడి
- వేట కొడవళ్లతో దాడికి తెగబడిన వైనం
- ప్రాణభయంతో పరుగులుతీసిన ఆర్ఐ, విఆర్ఒ
- ఆక్రమణలు తొలగిస్తున్న జెసిబికి నిప్పు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె గ్రామీణ మండలం, తట్టివారిపల్లి పంచాయతీ సర్వే నెంబరు 1029లో 50 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉంది. అందులో 4 సెంట్ల స్థలాన్ని చలపతి అనే వ్యక్తి ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారనే సమాచారంతో రెవెన్యూ ఇన్స్పెక్టర్ శేషాద్రిరావు, విఆర్ఒ ప్రసాద్ జెసిబిని తీసుకుని సంఘటన స్థలానికి వెళ్లారు. అక్రమ నిర్మాణాలను జెసిబితో తొలగించే ప్రయత్నం చేయగా భూ కబ్జాదారుడైన చలపతి రెవెన్యూ సిబ్బందిపై పరుష పదజాలంతో అసభ్యకరంగా విరుచుకు పడ్డాడు. తన అనుచరులతో కలిసి ఆర్ఐ, విఆర్ఒపై వేట కొడవళ్లు, కర్రలతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. అక్రమ నిర్మాణాలు తొలగించేందుకు తీసుకొచ్చిన జెసిబి డ్రైవర్ గణేష్‌పై దాడి చేశారు. జెసిబిపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టడంతో డ్రైవర్, రెవెన్యూ సిబ్బంది పరుగులు పెట్టారు. జెసిబి డ్రైవర్ సీటు పూర్తిగా కాలిపోడంతో అద్దాలను ధ్వంసం చేసి భయానక వాతావరణాన్ని సృష్టించారు. సమాచారం అందుకున్న తాలూకా సిఐ కళా వెంకట్రమణ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకోవడంతో దాడికి తెగబడిన చలపతి, ఆయన అనుచరులు పరారయ్యారు. మంటల్లో కాలిపోయిన జెసిబిని స్టేషన్‌కు తరలించారు. అర్ఐ శేషాద్రిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చలపతి అతని అనుచరులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది ఆర్ఐ, విఆర్ఒకు మద్దతుగా నిలిచారు. రెవెన్యూ సిబ్బందిపై జరిగిన దాడి ఘటనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా అభ్యర్థిస్తామని విఆర్ఒ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.



ఆక్రమణలు తొలగిస్తున్న జెసిబి

భూకబ్జాలకు అండగా ప్రభుత్వం : సిపిఎం

భూ కబ్జాలపై కూటమి ప్రభుత్వ పెద్దల ప్రకటనలకు, క్షేత్ర స్థాయిలో జరుగుతున్న సంఘటనలకు పొంతన లేకుండా పోయిందని, భూ కబ్జాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటోందని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు విమర్శించారు. బసినికొండలో ప్రభుత్వ భూమిలో అధికార పార్టీ పేరు చెప్పుకుంటూ చలపతి అనే అతను ఆక్రమణలకు పాల్పడుతుండగా అడ్డుకున్న రెవెన్యూ అధికారులపై దాడికి యత్నించడం దుర్మార్గమన్నారు. రెవెన్యూ అధికారులు తీసుకెళ్లిన జెసిబి అద్దాలు ధ్వంసం చేయడమే కాకుండా పెట్రోల్ పోసి నిప్పంటించాడన్నారు. చలపతి దాడి చేసిన మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శేషాద్రిరావు, విఆర్ఒ ప్రసాద్‌లను పరామర్శించిన శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ అధికారులపై దాడులకు పాల్పడిన చలపతిపై కఠిన చర్యలు తీసుకోవాలని, హత్యాయత్నం కేసు నమోదు చేసి, క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. చలపతి కోళ్లబైలు, బి.కె.పల్లి రెవెన్యూ గ్రామాల్లో కూడా భూ ఆక్రమాణలకు పాల్పడినట్లు బాహటంగానే ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. అధికార పార్టీ అందదండలతో రెచ్చిపోయిన చలపతి మచ్చుకత్తితో రెవెన్యూ అధికారులను చంపుతా అంటూ దాడికి పాల్పడటాన్ని అందరూ ఖండించాలన్నారు. ప్రభుత్వ భూముల రక్షణ కోసం ప్రజలను భాగస్వామ్యం చెయ్యాలని, ప్రభుత్వ భూముల్లో బోర్డులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ బాషా, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని అధికారులకు అండగా ఉండాలని, భూకబ్జాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సంఘటనా స్థలంలో విచారణ చేస్తున్న పోలీసులు



రెవెన్యూ సిబ్బందిని పరామర్శిస్తున్న సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

పేదలకు అందుబాటులో కంటి వైద్యం

- కంటి ఆస్పత్రి ప్రారంభోత్సవంలో జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

పేదలకు అందుబాటులో కంటి వైద్యాన్ని అందించాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం వైఎస్.రాజారెడ్డి ఆస్పత్రి స్థానంలో నూతనంగా నిర్మించిన ఎల్‌వి ప్రసాద్ సంస్థ ద్వారా ఆధునికీకరణ చేసిన రాజారెడ్డి ఐ ఇనిస్టిట్యూట్‌ను ప్రారంభించారు. ఆస్పత్రి అంతా తిరిగి ఏర్పాట్లను పరిశీలించారు. కంటి పరీక్షలు కూడా చేయించుకున్నారు. పులివెందులలో కొన్ని దశాబ్దాలుగా రాజారెడ్డి ఆస్పత్రి సేవలు అందిస్తోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఈ ఆస్పత్రిలోనే పనిచేసి రూపాయి వైద్యుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ ఆస్పత్రిని ఇప్పుడు అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దారని చెప్పారు. ప్రముఖ ఎల్‌వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, వైఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆస్పత్రిని అధునీకరించారని తెలిపారు. తక్కువ ఖర్చుతో అత్యాధునిక సౌకర్యాలతో ఇక నుంచి రాజారెడ్డి ఆస్పత్రిలో కంటి వైద్య సేవలు అందుతాయన్నారు. పులివెందుల నియోజకవర్గంలో కంటికి సంబంధించి ఆధునికమైన ఆస్పత్రి లేకపోవడంతో రాజారెడ్డి జ్ఞాపకార్థం ఆ స్థలంలో ఆస్పత్రిని నిర్మించి పేద ప్రజలకు అందించాలని ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. ఆస్పత్రి ఎమ్‌డి నాగేశ్వరావుని అడిగి విషయాలు తెలుసుకున్నారు. కంటి ఆస్పత్రి ప్రారంభానికి వచ్చిన జగన్‌ను వైసిపి కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున కలిసి తమ సమస్యలను తెలిపారు. చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరిస్తూ సెల్ఫీలు తీసుకున్నారు. ఏదైనా సమస్యలు ఉంటే అవినాష్‌రెడ్డి అందుబాటులో ఉంటారని ఆయన దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. సమస్యల పరిష్కారం కాకపోతే పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వైసిపి నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. రెండు రోజుల పర్యటన ముగించుకొని ఉదయం 11 గంటలకు పులివెందుల నుంచి హెలికాప్టర్‌లో బెంగళూరుకి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో కడప ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.సతీష్ కుమార్‌రెడ్డి, ఎల్‌వి ప్రసాద్ ఆస్పత్రి వైస్ చైర్మన్ డాక్టర్ రాజా, మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వై.ఎస్.మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, నాయకులు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



కంటి ఆస్పత్రిని పరిశీలిస్తున్న జగన్ (ఇన్‌సెట్)లో జగన్‌కు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆధునిక వైద్యమే లక్ష్యం : ఆస్పత్రి వైస్ చైర్మన్

పేద ప్రజలకు ఆధునిక వైద్యం అందించడమే లక్ష్యంగా ఎల్‌వి ప్రసాద్ సంస్థ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా రాజారెడ్డి ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేశామని వైస్ చైర్మన్ డాక్టర్ రాజా అన్నారు. రాష్ట్రంలో 151 ఆస్పత్రులు ఉన్నాయని తెలిపారు. ఆధునికమైన సెంటర్లలో పులివెందుల 24వ సెంటరని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వైద్యాన్ని తేవడానికి ఆస్పత్రి నిర్మించామన్నారు. భవిష్యత్తులో ప్రతి గ్రామంలోనూ సెంటర్లను ఏర్పాటు చేసి ఉచితంగా కంటి చికిత్సలను చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో విజయవాడ, వైజాగ్, కడప, భువనేశ్వర్‌లలో సూపర్ సోషల్ సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



రాయచోటి : వీరభద్ర స్వామికి పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో తాగునీటి సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం చూపుతామనిరవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామివారికి బుధవారం మంత్రిపట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. వీరభద్ర స్వామి ఉత్సవాలకు కర్ణాటక ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారని వారందరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తాగు, సాగునీటి సమస్య పరిష్కారానికి త్వరలో శాశ్వత పరిష్కారం చూపడం జరుగుతుందన్నారు. నా పైన ఎంత నమ్మకంతో గెలిపించిన నియోజకవర్గం ప్రజల రుణం తీర్చుకునేందుకు ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చి దిద్దుతామని చెప్పారు. సిఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రజలందరూ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధి చెందాలన్నారు.

గంగమ్మ జాతరలో అన్ని వసతులు కల్పించాలి

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మ జాతరలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చక్కగా చేపట్టాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గంగమ్మ దేవస్థానంలో భక్తుల వసతులకు సంబంధించి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి మార్చి 2వ తేదీ వరకు జరిగే గంగమ్మ జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా ముందస్తు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

చిన్నమండెం : ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ జరిపి సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లాలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను మంత్రి స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.



లక్కిరెడ్డిపల్లె : సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

దళిత, గిరిజనులపై నిందమోపడం తగదు : 'కొరముట్ల'



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కొరముట్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

అభంశుభం తెలియని చిన్న పిల్లలు దళితులు, గిరిజనలపై నింద మోపడం డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కు తగదని మాజీ శాసనసభ్యులు, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం కొరముట్ల మృతుల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రిని పురస్కరించుకొని సోమవారం రోజు రాత్రి ఊర్లగట్టుపోడు అరుంధతివాడ, కన్నెగుంట ఎస్‌టి కాలనీకి చెందిన సుమారు 30 మంది మొక్కు తీర్చుకోవడానికి గుండాల కొరకు వెళుతున్న సమయంలో ఏనుగులు దాడి చేయడం బాధాకరమని అన్నారు. సంఘటన స్థలంలో ఏం జరిగిందో, ఎలా జరిగిందో పూర్తి స్థాయిలో తెలుసుకోకుండా వారిపై ఎర్రచందనం నిందితులని అసెంబ్లీ సాక్షిగా డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని అన్నారు. ఇప్పటికే ఆ కుటుంబాల్లో సభ్యులను పోగొట్టుకొని దీనాతి దీనమైన స్థితిలో ఉండగా వారిపై మళ్లీ ఇటువంటి అభియోగాలు మోపి వారిని ఇంకా మానసికంగా బాధ పెట్టడం, మంచి పద్ధతి కాదని, అన్నాుడ. మృతి చెందిన వారిలో వంకాయల దినేష్‌అనే వ్యక్తి ఐటి ఉద్యోగిగా ఉంటూ త్వరలోనే కెనడాకు వెళ్లేందుకు కూడా టికెట్ కూడా బుక్ చేసుకోని ఉండగా, పొట్టకూటి కోసం కూలి పనులకు వెళ్లే గిరిజనులు తుపాకుల మనేమ్మ, తిరుపతి చెంగల్రాయుడు, గాయపడిన వరుణ్, (12), లోకేష్ (14). అమ్ములు (14) సంవత్సరాల చిన్న పిల్లలు వీరి పైన ఎర్రచందనం అభయోగాలు మోపడం ఎంతవరకు సమంజసమన్నారు. వంద సవంత్సరాల్లో ఎప్పుడు ఇలాంటి సంగటనులు జరగలేదని గతంలో మాదిరిగా ఫారెస్ట్ అధికారుల పర్మిషన్ ఇచ్చి ఎప్పుడు వెళ్లే మార్గాను వారిని వెళ్ళనిచ్చి ఉంటే ఇటువంటి సంఘటన జరిగేది కాదని, ఇలా దారి మూసేయడం వారు తెలియక వేరే దారిలో వెళ్లడం వలన ఏనుగులు దాడి చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా తప్పును ఒప్పుకొని ఆ కుటుంబాలకు క్షమాపణ చెప్పి మృతి చెందిన కుటుంబాలకు రూ.30 లక్షలు , గాయపడిన వారికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షులు శివారెడ్డి, జడ్‌పిటిసి రత్నమ్మ, సర్పంచ్ దార్ల చంద్రశేఖర్, ఎంపిటిసి బండారు మల్లికార్జున,దమ్ము రఘు, డివి రమణ, సిద్దయ్య, బాబు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం : ఓబులవారిపల్లి మండలం వై.కోట గుండాల కోనకు శివరాత్రి సందర్భంగా వెళుతున్న సమయంలో ఏనుగులు దాడి చేయడంతో ఇద్దరు యానాదులు మృతి చెందారు. యానాదులు సంక్షేమ సంఘం జిల్లా కమిటీ కన్నగుంట యానాది కాలనీ పరిశీలన చేసి ప్రభుత్వం నుంచి రావాల్సిన నష్టపరిహారం ఇప్పించేదానికి అండగా ఉంటామని బాధితులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పులిశివశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు సికోలి బాలాజీ, జిల్లా కార్యవర్గ నిర్వాహ కార్యదర్శి పాలేపు చెంగల్రాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు శినగా వెంకటరమణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎపిజిబిని కడపలోనే కొనసాగించాలి

ప్రజాశక్తి - కడప

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాల యాన్ని కడపలోనే కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు విజయ జ్యోతి డిమాండ్ చేశారు. ఆమెరకు బుధవారం కడప ప్రెస్ కార్యాలయం వద్ద ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోనే ఉండాలని ముద్రించిన పోస్టర్లను విజయ జ్యోతి ఆవిష్కరించారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలిస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సయ్యద్ గోస్ పీర్, సంజయ్ కాంత, సిరాజుద్దీన్, శీలం గంగయ్య, రఫీఖ్ ఖాన్ పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి మండల సమస్యలు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఒంటిమిట్ట మండల టిడిపి నాయకులు కలిసి మండల సమస్యలు వివరించారు. మండలంలోని పలు ప్రధాన సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అభివృద్ధి పనుల విషయంలో రాజకీయాల కారణంగా నిధులు మంజూరైన పనులు ప్రారంభం కాని విషయాన్ని మంత్రికి రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య తెలిపారు. మండలంలోని సమస్యలను పరిష్కరించాలని మంత్రి నాయకలు కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పామూరు సుబ్రహ్మణ్యం, మామిళ్ళ కృష్ణయ్య, మామిళ్ళ స్వరయ్య, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణలను తిరస్కరించండి : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప : కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి ప్రతిపాదించిన రాజ్యాంగ వ్యతిరేక సవరణలను తిరస్కరించి వాటి ఆస్తులను రక్షించాలని, రాష్ట్రంలో అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. కడపలోని స్థానిక ఐటిఐ సర్కిల్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద బుధవారం ఎపి కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్‌అలీఖాన్ సిఎంకు పంపిన బహిరంగ లేఖను మహాత్ముడికి నివేదించి విడుదల చేశారు. రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తులకు రక్షణగా ఉన్న పాత వక్ఫ్ రక్షణ చట్టం-1995ను మాత్రమే రాష్ట్రంలో అమలు చేస్తామని మరో అనుబంధ తీర్మానాన్ని కూడా ఆమోదించాలని బహిరంగ లేఖలో కోరారు. ప్రభుత్వానికి ముస్లిం మైనార్టీల పట్ల చిత్తశుద్ధి ఉంటే ముస్లిం మైనార్టీలకు సంబంధించి స్పష్టమైన విధాన ప్రకటనను ప్రకటించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ అనుబంధ మత విద్వేష సంస్థల నుంచి మైనార్టీలను రక్షిస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మసీదులు, స్మశాన వాటికలు, దర్గాల అభివృద్ధికి సంబంధించి ఓ నిర్దిష్టమైన ప్రకటనను చేయాలని కోరారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అనుసరిస్తున్న మత్తవిద్వేష పాలనా విధానాలు, ముస్లిం మైనార్టీలపై జరుగుతున్న దాడులు, హత్యలు, అమానుషత్వం, మత విద్వేష ప్రసంగాలు, ప్రకటనలను రాష్ట్రంలో నిషేధిస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ రక్షణ ఉద్యమాలతో పాటుగా సవరణల చట్టంను వ్యతిరేకిస్తూ ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చ రించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మయానా రహమ తుల్లాఖాన్, నాయ కులు ఎస్. హమీద్, దినకర్‌రెడ్డి, కమల్ బాషా, జహూర్, రహ మతుల్లా, మైనుద్దీన్ పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి లేఖ అందజేస్తున్న నాయకులు



పొలంలో టమోటాలు కోస్తున్న కూలీలు

టమోటా ధరలు పతనం

నిలకడ లేని ధరలు.. రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

టమోటా ధరలు ఒకేసారి భారీగా తగ్గడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఆరుగాలం కష్టపడి రూ.లక్షలు ఖర్చు చేసి టమాటా సాగు చేస్తే కనీసం పెట్టుబడి కూడా రావడం లేదు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో టమాటా రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట బాగా పండినా ధరలు మాత్రం లేకపోవడంతో రైతుల్లో నిరాశ నెలకొంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో 25 కిలోల టమాట బాక్స్ రూ.500 నుంచి రూ.600 ఉండేది. ప్రస్తుతం రూ.150 నుంచి రూ.200 మాత్రమే ఉంది. కూరగాయల మార్కెట్లో మాత్రం కాయలను బట్టి కిలో రూ.10 నుంచి రూ.20 అమ్ముతున్నారు. రైతు దగ్గర నుంచి మాత్రం రూ.5 నుంచి రూ.10కు కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టమోటా సాగులో పెట్టుబడులు పెరిగి పోతున్నాయి. ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతోంది. టమాటా కోతలు, మార్కెట్‌కు తరలింపు, రవాణా, ఎగుమతి దిగుమతి ఖర్చులు లెక్కిస్తే ఒక్కో బాక్స్‌కు రూ.40 వరకు వ్యయమైతుంది. ఒక్కో బాక్సుకు కమీషన్ రూ.10 ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా అన్నింటిని భరించి విక్రయించినా ప్రస్తుత ధరలతో తమకు భారీ నష్టమే వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.



మార్కెట్‌కు చేరిన టమోటాలు



ముఖ్యమంత్రికి పోస్టు కార్డు పంపుతున్న మున్సిపల్ కార్మికులు

ఆప్కాస్ రద్దు నిర్ణయం విరమించుకోవాలి


ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మున్సిపల్ కార్మికులకు ఒకింత భరోసాగా ఉన్న ఆప్కాస్ ను రద్దు చేసే ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని మదనపల్లి మున్సిపల్ కార్మికులు బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో పోస్టుకార్డులు రాసి ముఖ్యమంత్రికి పంపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి హరిశర్మ మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేసి అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిని తీసుకురావడం వల్ల ప్రయివేట్ ఏజెన్సీలు, కాంట్రాక్టర్లకే లాభం చేకూరుతుందే తప్ప అహర్నిశలు కష్టపడే పారిశుధ్య కార్మికులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. మున్సిపాలిటీలలో తక్కువ వేతనాలకు పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ, అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులు దశలవారీ చేస్తున్న పోరాటాల నేపథ్యంలో ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరవాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని కోరారు. కార్మికు లకు పెండింగ్‌లో ఉన్న ఇఎస్ఐ, పిఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన పనిముట్లు, యూనిఫాం, శానిటైజర్లు, చెప్పులు, సోపులు, ఆయిల్, గ్లౌజులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మదనపల్లి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు చలపతినాయుడు, సాంబశివనాయక్, రాము, కృష్ణప్ప, గోపాల్, బాలకృష్ణ, పాల్గొన్నారు.

గుండెపోటుతో జూనియర్ కాలేజీ లెక్చరర్ మృతి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఇంటర్‌మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యుడు, ప్రభుత్వ జూనియర్ కాలేజీ గణిత అధ్యాపకులు ఎస్.శివ హరిప్రసాద్‌రెడ్డి బుధవారం హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతికి డిఇసి కన్వీనర్, ఆర్ఐఒ వెంకట సుబ్బయ్య, తోటి అధ్యాపకులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు.





భోజనాన్ని అందిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

అన్నదానం గొప్పది

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్ప పుణ్య కార్యక్రమని రాష్ట్ర రవాణ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆయన సోదరుడు డాక్టర్ లక్ష్మి ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ కర్ణపువాండ్లపల్లి కర్ణపు రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం కల్పనాయుని చెరువు గ్రామంలో వెలసిన శివాలయం నందు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో కూడా మంత్రి మడ్డిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొని అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌రెడ్డి, టిడిపి నాయకులు వెంకట్రామిరెడ్డి, దిలీప్ యాదవ్, రామ్మోహన్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి , రామచంద్రయ్య రాజు, సురేందర్ రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

వైసిపి మండల అధ్యక్షులుగా ప్రదీప్‌రెడ్డి

- పట్టణ అధ్యక్షులుగా సి.ఆర్.చిన్నికృష్ణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బి.కొత్తకోట వైసిపి మండల అధ్యక్షులుగా ప్రదీప్ రెడ్డి, నగర పంచాయతీ అధ్యక్షులుగా సి.ఆర్.చిన్నికృష్ణలను నియమిస్తూ పార్టీ అధిష్టానం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైసిపి అధ్యక్షులు అధ్యక్షుడు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి వీరిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో పదవులు అప్పగించినందుకు మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారక నాథ్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండలం, నగర పంచాయతీ పరిధిలో వైసిపిని బలోపేతం చేయడానికి కృషి చేస్తామని, 2029లో వైసిపిని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చి, మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవడానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామని అన్నారు. తమకు ఈ పదవులు రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - చాపాడు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఎడ్లచే రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన ఎడ్ల యజమానులకు విశ్వనాథపురం గ్రామానికి చెందిన ఇరగంరెడ్డి కార్తీక్‌రెడ్డి రూ.1,00,116, రెండవ బహుమతిని నెర్రవాడకు చెందిన చల్లా గంగయ్య, కొల్లూరుకు చెందిన పి.క్రిష్ణయ్య సంయుక్తంగా రూ.70,116, మూడవ బహుమతి పార్వతీనగర్ కొండపల్లి వీరభద్రయ్య కుటుంబ సభ్యులు, చెన్నూరు జ్యువెలర్స్ వారు సంయక్తంగా రూ.60,116, నాలుగో బహుమతిని నరహరిపురం గ్రామానికి చెందిన పాలెంపల్లె సుబ్బ రామిరెడ్డి కుటుంబ సభ్యులు రూ.40,116, 5వ బహుమతి అల్లా డుపల్లె రజకుల సంఘం రూ.20,116, 6వ బహుమతి నరహరిపురం గ్రామానికి చెందిన పి.చిన్న వీరారెడ్డి కుటుంబ సభ్యులు రూ.12,116, 7వ బహుమతి కోడూరు వెంకటేష్ కుటుంబ సభ్యులు రూ.5,116 అందజేయనున్నారు. బహుమతి రాని ఎడ్లకు కన్సోలేషన్ బహుమతి కూడా అందజేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జనరల్ నోటీసు

నా క్లయింట్ శ్రీమతి కొండూరు సుగుణ w/o కొండూరు శరత్ కుమార్ రాజు, డోర్ నెంబర్ 4/235 -J, కొలిమి వీధి రాజంపేట పట్టణం & మండలం, అన్నమయ్య జిల్లా, A.P వారు ఇచ్చిన వివరముల మేరకు ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా.. నా క్లయింట్ m/s వర్ధన ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, నెల్లూరు బ్రాంచ్ మేనేజర్ వారి దగ్గర నుంచి రుణ సౌకర్యం పొందగోరి క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని తనకా ఉంచాలనుకునే ఉద్దేశంతో నన్ను సంప్రదించడం జరిగినది. సదరు కొండూరు సుగుణకు క్రింద షెడ్యూలు దాఖలా ఆస్తి ఆమె భర్త 1. కొండూరు శరత్ కుమార్ రాజు 2. భర్త సోదరుడు కె.జయదేవ్ రాజు మరియు 3.భర్త సోదరి పి.రేణుక గార్ల వద్ద నుండి రిజిస్టర్ సెటిల్మెంట్ పత్రం నెంబర్ 3249/23, 31.08.2023 వ తేదీ ద్వారా సంక్రమించినది. సదరు 1.కే. శరత్ కుమార్ రాజు, 2.కె.జయదేవ్ రాజు, 3.పి. రేణుక లు కీర్తిశేషులు కొండూరు రామరాజు s/o కీర్తిశేషులు వెంకటరాజు కుటుంబ సభ్యులు. సదరు కొండూరు రామరాజు గారు 24.05.2014 లో మరణించారు. సదరు షెడ్యూలు దాఖలా ఆస్తిని కీర్తిశేషులు కొండూరు రామరాజు మరియు పి.చండేకమ్మ w/o పి.గురు మోహన్ రాజు, పి.లక్ష్మీదేవి w/o పి.వెంకటేశ్వర్ రాజు, పి.స్వరూపారాణి w/o పి.రామరాజు అనువారులు నలుగురు కలిసి బొగ్గరపు చిన్న మల్లమ్మ w/o వెంకటేశ్వర గుప్త ద్వారా విక్రయం ద్వారా డాక్యుమెంట్ నెంబర్ 198/98 తేదీ 12.03.1998 రిజిస్టర్ చేయించుకుని విక్రయ దస్తావేజులు కలిగి ఉన్నారు. సదరు కొండూరు సుగుణ తన ఒరిజినల్ రిజిస్టర్ సెటిల్మెంట్ దాస్తావేజు కాపీ రాజంపేటలో పోయినదని తెలియజేసినారు. సదరు దస్తావేజు ఎవరి స్వాధీనంలో ఉన్ననూ మరియు క్రింద షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలు ఉన్నయెడల ఈ పత్రిక ప్రకటన తేదీ నుండి 7 రోజులు లోపల తెలుపవలసినది. గడువు తదుపరివచ్చు ఆక్షేపణలు స్వీకరించబడవు.

షెడ్యూలు-1

అన్నమయ్య జిల్లా, రాజంపేట సబ్ రిజిస్టర్ కార్యాలయం, రాజంపేట మున్సిపాలిటీ 6 వ వార్డు, నూనేవారిపల్లి రోడ్డు ఏరియాకు చెందిన రాజంపేట గ్రామ పొలం సర్వే నెంబర్ 931/1 పైకి 0.04 సెంట్లు 619 చదరపు లింకులు లేక 223.60 చ.గజముల విస్తీర్ణం గల జాగాలో నిర్మించి డోర్ నెంబర్ 6/969-IV-5 అసెస్మెంట్ నెంబర్ 1120004236, H.S.C.NO 2324401008557 గల R.C.C. మిద్దె మహాడి ఇంటిలో కొంత భాగం గల ఆస్తి.

సరిహద్దులు :
తూర్పు-ఉమ్మడి రోడ్డు, పడమర-ఇళ్ళు శ్రీనివాసులు మరియు కీర్తి కాంతమ్మకు చెందినది. ఉత్తరం- పి.లక్ష్మీదేవి నుండి కొనుగోలు చేసిన కే.శరత్ కుమార్ రాజు వాటా, దక్షిణం- మద్దిపట్ల అమ్మన్నమ్మ భవనం
ఈ మధ్య గల జాగా కొలతలు
తూర్పు-పడమర : ఉత్తర దిశలో 111 లింకులు 73.26 అడుగులు, దక్షిణ దిశలో 109 లింకులు 71.94 అడుగులు. ఉత్తరం-దక్షిణం : తూర్పు దిశలో 42 లింకులు 27.72 అడుగులు,: పడమర దిశలో 42 లింకులు 27.72 అడుగులు 223.60 చదరపు గజములు విస్తీర్ణంలో విస్తీర్ణం గల జాగా ఇందులో 1/4 వ భాగం అనగా 55.90 చదరపు గజములు లేక 0.01 సెంటు 155 చదరపు లింకులు పైన తెలిపిన జాగాలో నిర్మించిందు ఆర్ సి సి గ్రౌండ్ ఫ్లోర్ 1820 చ. అడుగులు, ఫస్ట్ ఫ్లోర్ 1820 చదరపు అడుగులు, సెకండ్ ఫ్లోర్ 1820 చదరపు అడుగులు వెరసి 5460 చదరపు అడుగుల విస్తీర్ణంలో మాకు హక్కు కలిగిన 1/4 వ భాగం 1365 చ.అడుగులు గల ఆర్ సి సి మిద్దె మహాడి ఇళ్ళు ఇందుకు సంభందించిన కిటికీలు, అలమరాలు, కరెంటు మీటరు వగైరాలుతో సహా ఈ ఇంటికి సంబంధించిన యావత్తు ఈజమెంటు హక్కులతో సహా.

షెడ్యూల్-2

అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్ రిజిస్టర్ కార్యాలయం, రాజంపేట మున్సిపాలిటీ 6 వార్డు నూనే వారి పల్లె రోడ్డు ఏరియాకు చెందిన రాజంపేట సర్వే నెంబర్ 932/1 పైకి 0.04 సెంట్లు 836 చదరపు లింకులు

సరిహద్దులు :
తూర్పు సరిహద్దు : ఉమ్మడి రోడ్డు, పడమర : కాళహస్తి లక్ష్మీకర్ మరియు కాంతమ్మ భవనం, ఉత్తరం : పందేటి స్వరూపారాణి గారి ద్వారా మాలో 1.ఈసము ఐన కొండూరు శరత్ కుమార్ రాజుగారు విక్రయించుకున్న ఆస్తి, దక్షిణం : మాలో 1 ఈసము ఐన కొండూరు శరత్ కుమార్ రాజు ఆస్తి, ఈ మధ్య గల 0.04 సెంట్లు 836 చదరపు లింకులు విస్తీర్ణంలో ఇదివరలో మాలో 1 వ ఈసము పేరా రాయించిన 0.04 సెంట్లు పోనూ మిగిలిన 836 చదరపు లింకులు లేక 40.46 చదరపు గజములు విస్తీర్ణం గల బిడువు జాగా మాత్రం.

కె. సురేంద్ర బాబు, ఎం.కాం., బి.ఎల్,
అడ్వకేట్, H. No. 5/259, కొలిమివీధి,
రాజంపేట (మండలం & టౌన్),
అన్నమయ్య (D.T), ఆంధ్ర ప్రదేశ్ - 516115,
సెల్ నెంబర్ :9848518220

CHANGE OF NAME

I, SHAIK JAKRIYA (old name), S/o. Shaik Saheb Jan, resident of D.No.20/61-A, Ravi Hall back side, Kottapalli, Rayachoti, Annamayya Dist., Andhra Pradesh. I Changed my name to SHAIK ZAKRIYA . Henceforth, Iwill be known as SHAIK ZAKRIYA .

మహారాజశ్రీ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ కోర్ట్ : రైల్వేకోడూర్

O.S.No. 100/2024

బండ్ల ఇంద్రావతి, భర్త బండ్ల రాజేంద్ర, హిందువు, వయస్సు 53 సంవత్సరాల, చీరల వ్యాపారం, డి.నెం.9/84, చిన్న ఓరంపాడు గ్రామం, ఓబులవారిపల్లి (మ), అన్నమయ్య (జి) (పూర్వం వై.యస్.ఆర్. కడప జిల్లా),ఆంధ్రప్రదేశ్-516108 లో స్థిర నివాసం మరియు గతంలో మధురా నగర్, డి.నెం. 9/18లో నివాసం తిరుపతి మండలం మరియు తిరుపతి జిల్లా. ...వాది

Vs

షేక్ రజియా, భర్త షేక్ మహబూబ్ బాషా, ముస్లిం, వయస్సు 46 సంవత్సరాలు, గృహిణి, నివాసం ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా, ఓబులవారిపల్లి మండలం, అన్నమయ్య జిల్లా (పూర్వపు వైయస్‌ఆర్ కడప జిల్లా), ఆంధ్రప్రదేశ్-516108. ...ప్రతివాది

పబ్లిక్ నోటీసు

పై పేర్కొబడిన వాది, ప్రతివాది అయినా మీ పైన పై తెలిపిన నెంబర్ గల సివిల్ దావాను మహారాజశ్రీ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ కోర్ట్, రైల్వేకోడూర్ యందు దాఖలు చేసియున్నారు. మీకు ఏమైనా ఆక్షేపణ ఉన్న యెడల పై మహారాజశ్రీ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ కోర్ట్, రైల్వేకోడూర్ వారి యెదుట 20.03.2025 వ తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై తమరి యొక్క అభ్యర్ధనను తెలుపుకొనగలరు. లేకున్నను పై నెంబర్ గల సివిల్ దావాను మీ పై పరోక్షమున మహారాజశ్రీ పై తెలిపిన కోర్టు వారు తీర్మాణించెదరని తెలియజేయడమైనది.

//కోర్ట్ వారి ఉత్తరువుల మేరకు//

కె.సురేష్, బి.యస్.సి., ఎల్.ఎల్.బి.,
న్యాయవాది, రైల్వేకోడూరు. సెల్ : 9966639997

పదవ తరగతి భవిష్యత్తుకు దిశ

- 100 శాతం ఫలితాల కోసం ప్రత్యేక ప్రణాళిక
- మార్చి 17 నుంచి పబ్లిక్ పరీక్షలు
- ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహణ

ప్రజాశక్తి-పుల్లంపేట

విద్యార్థి దశలో పదవ తరగతి తొలి మెట్టు దశ దిశను నిర్దేశిస్తుంది. తొలిమెట్టు సరిగా పడితే భవిష్యత్తు అంతా బాగుంటుందనేది ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆశ. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని కాంక్ష విద్యార్థుల్లోనే కాకుండా ఉపాధ్యాయుల్లోనూ బలంగా ఉంటుంది. దీనికి అనుగుణంగానే పదవ తరగతి పరీక్షల కోసం సన్నద్ధం చేసేం దుకు కసరత్తు మొదలుపెట్టారు. పదిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మాత్రమే ట్రిపుల్ ఐటిలో సీటు లభిస్తుంది. ఎన్నో ప్రతిభ పురస్కారాలు, ఉపకార వేతనాలు లభిస్తాయి. పరీక్షలకు కేవలం మరో 19 రోజులు మాత్రమే ఉండటంతో ఈ ప్రక్రియ మరింత ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఆయా సబ్జెక్టులకు విద్యార్థులకు అర్థమయ్యేలా సులబతరంగా బోధిస్తూ మంచి వాతావరణాన్ని కల్పిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు మళ్లీ సాయంత్రం నాలుగు గంటల నుండి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్, స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు వచ్చిన మార్కులకు ఆధారంగా వారిని గ్రూపులుగా విభజించి సబ్జెక్టులు వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి మెలుకువలు నేర్పి వారికి కూడా ఎ గ్రేట్ విద్యార్థులుగా తీర్చిదిద్దడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించారు. మండల వ్యాప్తంగా మొత్తం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరు, రెండు ఎయిడెడ్ పాఠశాలలు, మూడు ప్రవేట్ పాఠశాలలు, ఒక మోడల్ స్కూల్, ఒక కస్తూరిబా గాంధీ మహిళ పాఠశాల ఉన్నాయి. మండల వ్యాప్తంగా మొత్తం 373 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయనున్నారు.



విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

గ్రూపులు వారీగా విభజించి విద్యార్థులకు బోధన

ఉపాధ్యాయులు విద్యార్థులను గ్రూపులుగా విభజించి ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివిస్తున్నాం. దీనివలన విద్యార్థిని అభ్యసన స్థితి ఉపాధ్యాయుడికి అర్థమై వెంటనే సబ్జెక్టు వారీగా కూడా విద్యార్థులకు సలహాలు సూచనలు అందిస్తున్నారు. విద్యార్థి అన్ని సబ్జెక్టుల్లో నిష్టాతుడై ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుంది.

- సుబ్బ లక్ష్మమ్మ, హెచ్‌ఎం, అనంతంపల్లి

సిలబస్ రివిజన్‌కు అవకాశం

ఉదయం, సాయంకాలం రోజుకు ఒక సబ్జెక్టుకు చొప్పున ప్రత్యేక తరగతులతో సిలబస్ రివిజన్‌కు అవకాశం ఏర్పడింది. ప్రత్యేక తరగతులతో పాఠశాలలో ఎక్కువ సమయం ఉండటంవల్ల ఆయా సబ్జెక్టులు టీచర్లు అందుబాటులో ఉంటున్నారు. దీనికి తోడు సైన్స్ పరీక్ష రెండు రోజులు పాటు నిర్వహించడం బాగుంది.

-సుమంత్ 10వ తరగతి విద్యార్థి

టాప్ ర్యాంక్ లక్ష్యంగా సాధన

పాఠశాలలో ప్రతిరోజు ఉదయం సాయంత్రం నిర్వహించే స్టడీ అవర్స్ ఎంతో ఉపయోగపడుతున్నాయి. స్టడీ అవర్స్ లో ఉపాధ్యాయులు సబ్జెక్టుల్లో ఏవైనా అనుమానాలు ఉంటే అప్పుడే నివృత్తి చేస్తున్నారు. టాప్ ర్యాంక్ లక్ష్యంగా కష్టపడి చదువుతున్నాం.

-మోనిష్, 10వ తరగతి విద్యార్థి

నూరు శాతం ఫలితాల కోసం ప్రత్యేక దృష్టి

పదవ తరగతిపరీక్షల ఫలితాల్లో ప్రతి ప్రభుత్వ పాఠశాల నూరు శాతం ఫలితాలు సాధించే దిశగా హెచ్‌ఎంలు ఉపాధ్యాయులు వంద రోజులు ప్రణాళికను కచ్చితంగా అమలు చేస్తున్నారు. ఉదయం సాయంత్రం నిర్వహిస్తున్న స్టడీ అవర్స్ విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. నూరు శాతం ఫలితాలను సాధించే దిశగా పనిచేస్తున్నాం.

-నాగ తిరుమలరావు, ఎంఇఒ2

ఘనంగా శివరాత్రి ఉత్సవాలు



బి.కొత్తకోట : శివరాత్రి ఉత్సవాలో ఆలయ పీఠాధిపతి లక్ష్మీపతి, పోలీసు సిబ్బంది

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మహాశివరాత్రి పండుగ సందర్భంగా మండంలోని బీరంగి పంచాయతీలోని గూగుటికోనలోని బండెన్నస్వామి దర్శనానికి ప్రజలు తరలివచ్చారు. ఆలయ పీఠాధిపతి పగడాల లక్ష్మీపతిస్వామి మాట్లాడుతూ ప్రతి ఏడాది మహాశివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా అన్నారు.తంబళ్లపల్లి నియోజకవర్గంతోపాటు కర్ణాటక నుండి ప్రజలు,భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారన్నారు.251 దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా జరిగిందన్నారు. **నిమ్మనపల్లి :** తవళం గ్రామంలోని శ్రీ యోగ నేలమల్లేశ్వర స్వామి ఆలయంలో ఆలయ తాత్కాలిక కమిటీ చైర్మన్ మేష రామకృష్ణ, ఇఒ మంజుల ఆధ్వర్యంలో మహాశివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఊట వంకలోని సోమేశ్వర నాదుని ఆలయంలో అర్చకులు ప్రత్యేక అభిషేకాలు పూజలను నిర్వహించారు. స్వామివారిని పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గార్గేయ శిఖరం పై బంగి కృష్ణప్ప జ్యోతి ప్రజ్వలన చేశారు. రాత్రి శ్రీ కామేశ్వర సమేత నేలమల్లేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండగ ఆలయ అర్చకులు నిర్వహించారు. రాత్రి తిరునాళ్లను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో రాత్రి ద్రౌపతి వస్త్రాపహరణం పౌరాణిక నాట్యాన్ని ప్రదర్శించారు. ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం మదనపల్లి ఆర్టీసీ రెండవ డిపో వారు బుధవారం ఉదయం నుంచి ఆలయం వద్దకు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు. ఎస్ఐ తిప్పేస్వామి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. **మదనపల్లె అర్బన్ :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పట్టణంలోని ప్రముఖ శైవక్షేత్రాలను సందర్శించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. దేవళం వీధిలోని సోమేశ్వరస్వామి ఆలయం, మడికయల శివాలయం, మంజునాథ ఆలయం తదితర శివాలయాలలో పర్యటించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రశాంత వాతారణంలో భక్తి శ్రద్ధలతో కుటుంబ సమేతంగా, బంధువులు, మిత్రులు, ఇరుగుపపరుగు వారు కలిసి పండుగలు జరుపుకోవడం మంచి అనుభూతిని కలిగిస్తోందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రామకృష్ణ ఆచారి, పూల మురళి, బెల్లె రెడ్డిప్రసాద్, జెసిబి వేణు, నాదెళ్ల శివప్రసాద్, ఎస్ఎ.మస్తాన్, నాయి బ్రాహ్మణ సంఘం మంజునాథ్, దొరస్వామి పాల్గొన్నారు.పట్టణంలోని పలు శివాలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని అన్ని ఆలయాల వద్ద అన్ని వసతులు ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మడికయల శివాలయంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మల్లయ్యకొండ కు భక్తులు పెద్ద ఎత్తున కాలినడకన వెళ్లి పండగను జరుపుకున్నారు. హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో మల్లయ్యకొండ చేరుకున్న భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. పలువురు భక్తులు జాగారాన్ని ఆచరించారు. **రాజంపేట అర్బన్ :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు అత్తిరాలలోని శ్రీ కామాక్షి సమేత త్రైతేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూసందర్భంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని చమర్తి ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు సంక్షేమ ఫలాలు సంతృప్తి స్థాయిలో అందుతున్నా యన్నారు. అంతకు ముందు ఊటుకూరు, మందపల్లె శివాలయాలను సందర్శించి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గన్నే సుబ్బనసయ్య నాయుడు, మాజీ మండల అధ్యక్షులు కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు, ఉపాధ్యక్షులు ఆర్.సతీష్ రాజు, హత్యరాల మాజీ చైర్మన్ పూలనరసింహులు, కమ్మ సంఘం జిల్లా అధ్యక్షులు శివ నారా యణచౌదరి, పార్లమెంట్ కార్యదర్శి కొండా శ్రీనివాసులు, మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్‌రాజు, క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు, ఊటుకూరు పెంచలరాజు పాల్గొన్నారు. **వీరబల్లి :** మండలంలోని హరిహరుల దేవాలయం, డి.రాచపల్లిలోని మల్లేశ్వరస్వామి ఆలయం, ఎర్రగట్టు మీద ఉండే శివాలయం, గడికోటశివాలయాలు ప్రజలతో కిటకిటలాడాయి. భక్తులు అధిక సంఖ్యలో శివాలయాలకు తరలివచ్చి దీపారాధనలు, అభిషేకాలు చేపట్టారు. ఆలయాలకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, దేవాదాయ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. **పీలేరు:** పట్టణంలోని శ్రీ కాశీ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, దొడ్డిపల్లి పంచాయతీ, శివరామపురం గ్రామం, గార్గేయ నది ఒడ్డున వెలసిన శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం, తలుపుల పంచాయితీ, అడవిపల్లి అటవీ ప్రాంతంలోని శ్రీమద్గుండాల మల్లేశ్వర స్వామి ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల్లోని శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కళకళలాడాయి.ఆలయాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు, సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. పోలీసులు ఆలయాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తును నిర్వహిస్తున్నారు.



మదనపల్లి : శివరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, టిడిపి నాయకులు

గంగమ్మ జాతరకు పటిష్ట బందోబస్తు : డిఎస్‌పి



మాట్లాడుతున్న రాయచోటి డిఎస్‌పి కృష్ణమోహన్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

గంగమ్మ జాతరకు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు రాయచోటి డిఎస్‌పి కృష్ణమోహన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక గంగమ్మ దేవత ఆలయం వద్ద సిఐ వెంకట కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 300 మంది సిబ్బందిలో 24 మంది ఎస్ఐలు, ఏడుగురు సీఐలు ఈ జాతరలో బందోబస్తులో పాల్గొంటారన్నారు. క్యూలైన్, సాంస్కృతిక కార్యక్రమాలు, పార్కింగ్‌లకు ఈ బందోబస్తును విభజించామన్నారు. పోలీసులకు భక్తుల సహకారం అవసరమని అన్నారు. చాందిని బండ్లు ఎత్తు 10 అడుగులకు మించకూడదనీ, చాందిని బండ్లకు పోలీసుల అనుమతి తప్పనిసరన్నారు. లక్షలాది మంది భక్తులు ఉంటారు కాబట్టి బాణాసంచా నిషేధించాం అన్నారు.మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. జాతర ఉత్సవాలకు సిసి కెమెరాలతో నిఘా ఉంచినట్లు తెలిపారు. జాతరలో కమాండ్ కంట్రోల్‌ను ఏర్పాటు చేశామని, డ్రోన్ కెమెరాలతో సైతం పర్య వేక్షిస్తామని చెప్పారు. మద్యం దుకాణాలు వెలిస్తే కేసులు నమోదు చేస్తామని, అశ్లీల నృత్యాల ప్రదర్శిస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు.

పొంగి పొర్లుతున్న మురుగు కాలువలు

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక బస్టాండ్ ఆవరణంలో ఉన్న ప్రధాన మురుగు కాలువ పొంగి ప్రవహి స్తోంది. ఇటీవల బస్టాండ్ నుంచి కదీర్ అంగడి వరకు జెసిపి ఉపయోగించి కాలువను శుభ్రం చేయించారు. మరలా కాలవ పొంగి ప్రవహిస్తుండటంతో పెద్దూర్ రోడ్లోకి మురికి నీరంతా చేరి ఇబ్బందిగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై మురుగునీరంతా చేరి దుర్వాసన వెదజల్లుతోందని అన్నారు. కాలువల్లో నీరు ఎక్కడ నిలిచిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని అన్నారు. మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలు ప్రభలే ప్రమాదం ఉందని అన్నారు. పంచాయతీ అధికారులు దృష్టి పెట్టి పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



పెద్దూర్‌లో రోడ్డుపైకి పారుతున్న మురుగునీరు



అడవికి నిప్పుపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

అడవికి నిప్పు..మూగజీవాల ప్రాణాలకు ముప్పు

- డిప్యూటీ ఆర్ఒఐ మదన్‌మోహన్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

అడవికి నిప్పు పెట్టి మూగజీవాల ప్రాణాలు తీయకు అని మదనపల్లి అటవీశాఖ డిప్యూటీ ఆర్ఒఐ మదన్‌మోహన్ అన్నారు. బుధవారం తవళం అటవీశాఖ బీటు పరిధిలో ఎఫ్‌బిఒలు దీప, త్యాగరాజులతో కలిసి అడవికి నిప్పు పెట్టడంపై అవగాహన కల్పించారు. అటవీ ప్రాంతంలోని నేలమల్లేశ్వర స్వామి దేవస్థానం వద్ద భక్తులకు అడవి జంతువు పెట్టడంపై అవగా కల్పించారు. అడవికి నిప్పు పెట్టడం ద్వారా అనేక నష్టాలు ఉన్నాయని తెలిపారు. అరుదైన వన్యప్రాణులు, మూగజీవాలు మృత్యువాత పడతాయని అన్నారు. అడవిలో పచ్చదనం లేకపోవడంతో వాతావరణంలో అనుకూల మార్పులు ఏర్పడవని, తద్వారా సకాలంలో వర్షాలు కూడా రావన్నారు. అడవిని కాపాడుకోవడం, వృక్ష సంపదను కాపాడుకోవడం, వన్యప్రాణులు, మూగజీవాలను సంరక్షించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ప్రజలు అడవుల ప్రాముఖ్యతను తెలుసుకొని వాటిని అగ్ని ప్రమాదాల నుంచి కాపాడుకోవాలని సూచించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలని ఎంఇఒ జాఫర్ సాదిక్ పేర్కొన్నారు. స్థానిక ఉర్దూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాఫర్ సాదిక్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ ముఖ్యమన్నారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రణాళికబద్ధంగా చదవాలని కోరారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు కృషి అనేది చాలా ముఖ్యమన్నారు. పరీక్షల భయం విద్యార్థుల్లో ఉండకూడదన్నారు. అనంతరం అయా పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 స్టాలిన్ ఐజాక్, పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగిన సంచార పశువైద్య ఆరోగ్య సేవలు

ఇబ్బందులు పడుతున్న పశుపోషకులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సంచార పశు వైద్య ఆరోగ్య సేవలు ఆగిపోవడంతో పశుపోషకులు, కోళ్ళ, జీవాల పెంపకందారులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో జీవీకే ఈఎంఆర్ఐ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గానికి రెండు సంచార వైద్య సేవల వాహనాలు అందుబాటులో ఉండేవి. మొదటి విడతగా పులివెందుల, రెండో విడతలో వేంపల్లి కేంద్రాల నుంచి సంచార పశు వైద్య ఆరోగ్య సేవలను అందించేవారు. మొదటి విడత పంపిణీ చేసిన వాహనాలకు సంబంధించి గడువు ముగియడంతో ఈనెల 15వ తేదీ నుంచి సంచార పశు వైద్య ఆరోగ్య సేవల వాహనాలను నిలిపివేశారు. ఈ సంచార వైద్య సేవల వాహనంలో ఒక డాక్టర్, అసిస్టెంట్, డ్రైవరు ఉండేవారు. వీరు రైతుల నుంచి 1962 నెంబర్‌కు ఫోన్ చేస్తే రిజిస్టర్ చేసుకుని రోజుకు 10 గ్రామాల చొప్పున వైద్యులు వెళ్లి సేవలు అందించేవారు. మండల వ్యాప్తంగా ఆవులు, గేదెలు 10,400, మేకలు, పొట్టేలు 24,500, కోళ్ల 6,500 ఉన్నాయి. వీటితోపాటు పెంపుడు కుక్కలు, ఇతర జంతువులు మరో రెండు వేల పైచిలుకు ఉన్నట్లు పశువర్ధక శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వం సంచార పశు వైద్య సేవలను నిలిపి వేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాటి పోషకులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సంచార పశువైద్య సేవలను అందుబాటులోకి తేవాలని వారు కోరుతున్నారు.

అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

- గజవాహనంపై ఊరేగిన కపిలేశ్వరుడు

ప్రజాశక్తి-కలకడ



పార్వతి పరమేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు అర్చకులు విజయసారథిశర్మ తెలిపారు. మండలంలోని దేవాలయం పేటలో వెలిసిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా పార్వతి పరమేశ్వరుల కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించి నట్లు తెలిపారు. అనంతరం పార్వతీ పరమేశ్వరులను రంగు రంగుల విద్యుత్ దీపాలు పూలతో అలంకరించిన గజవాహనంపై పురవీధులలో ఊరేగించారు. మహాశివరాత్రి పండుగ పురస్కరించుకుని శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిట లాడింది.అభిషేకాలు, అర్చనలు, బిల్వార్చన వంటి పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు శర్మ తెలిపారు.

ల్యాబ్ ఏర్పాటుకు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - సింహాద్రిపురం : సింహాద్రిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్ ల్యాబ్ ఏర్పాటుకు పూర్వ విద్యార్థి రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. ప్రస్తుతం కొండాపురం హైస్కూల్ హెచ్‌ఎం సతీష్‌బాబు అందజేశారు. స్థానిక పాఠశాలలో బుధవారం హెచ్‌ఎం ఉమామహేశ్వరి, మాజీ జెడ్పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ఆ మొత్తాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సతీష్‌బాబు మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు జాన్ సుందర్ రావు, జయమణి జ్ఞాపకార్థం ఇచ్చానని తెలిపారు. పూర్వ విద్యార్థిగా తాము చదివిన పాఠశాలకు తమ వంతు సహకారాలు ఎప్పటికీ ఉంటాయని తెలిపారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్ బోల్తా : వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాచవేటివారిపల్లి పంచాయతీ ఎగువమాచిరెడ్డిగారి పల్లి వద్ద ఉన్న ఓ ఇటుకల బట్టీలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన పోదన్ (40), దీపక్ పనిచేస్తున్నారని అన్నారు. బుధవారం ఇద్దరు ఎగువమాచిరెడ్డిగారిపల్లె ఇటుకుల బట్టి నుంచి ఇటుకలను ట్రాక్టర్ లో లోడు చేసుకుని బోయకొండ వద్ద ఇటుకులను దింపి తిరిగి వస్తుండగా మార్గమధ్యలోని బోయకొండ ఆర్చ్ దిగువన ఉన్న శాంతయ్య బోరు సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిందన్నారు. గమనించిన స్థానికులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకోగా ట్రాక్టర్ డ్రైవర్ దీపక్ పరారు కాగా, మరో వ్యక్తి పోదన్ ట్రాక్టర్ లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే ప్రాణాలు విడిచారన్నారు. ఎస్ఐ తిప్పేస్వామికి స్థానికులు సమాచారం అందించారు. ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకొని ఘటనకు సంబంధించిన కారణాలను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అదుపుతప్పి బోల్తాపడిన ట్రాక్టర్‌లో చిక్కుకున్న పోదన్ మృతదేహం